క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవనం ఎదుట డ్రెయినేజీ నిర్మించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు పద్మశాలి భవన కమిటీ నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. డ్రెయినేజీ లేక రోడ్డుపై మురుగు నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాపెల్లి సదానందం, నల్ల కనకయ్య, గెల్లపల్లి నగేశ్వర్‌రావు, గడదాసు మల్లయ్య, కొంపెల్లి సుదర్శన్, చక్రపాణి, గడదాసు శంకరయ్య, అల్లి గురవయ్య, బోగ వెంకటేశం పాల్గొన్నారు.

మొదలైన పొలాల అమావాస్య



అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు

సిర్పూర్(టి): పొలాల అమావాస్య పండుగ సందడి మొదలైంది. రైతులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇప్పటికే వ్యాపార సముదాయాలు, వారసంతల్లో పొలాల అమావాస్య పండుగ సామగ్రి దుకాణాలు వెలిశాయి. రైతులు తమ ఎడ్లను అలంకరించేందుకు సామగ్రితో పాటు వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేస్తుంటారు. అయితే దుకాణాలతో స్థానిక బస్టాండ్ ప్రాంతంలో సందడి నెలకొంది.

గ్రామాల్లో మారుగోళ్ల సందడి



మారుగోళ్లపై ఆడుతున్న పిల్లలు

కాగజ్‌నగర్ టౌన్: పొలాల అమావాస్యను పురస్కరించుకుని గ్రామాల్లో మారుగొళ్ల సందడి మొదలైంది. పొలాల అమావాస్యకు ముందు పదిహేను రోజుల పాటు మారుగొళ్లను తయారు చేసి పిల్లలు, పెద్దలు వీటిని వినియోగిస్తారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో గ్రామాలు బురదమయంగా మారడంతో అందులో నడిచేందుకు పిల్లలు ఇబ్బంది పడకుండా పూర్వ కాలం నుంచి వెదురు కర్రతో మారుగోళ్లను తయారు చేసి వాటినిపై నడుస్తుంటారు. బురదతో కాళ్లు చెడిపోకుండా ఉండేందుకు వీటిని వినియోగిస్తుంటారు. అంతే కాకుండా ఆత్మస్థైర్యం పెరుగుతుందని పెద్దలు చెబుతుంటారు. ఆదివారం మండలంలోని చారిగాం గ్రామంలో మారుగోళ్లతో చిన్నారులు నడిచారు.

తీజ్ ఉత్సవం



గోధుమ బుట్టలతో చిన్నారులు, యువతులు

కెరమెరి/ఆసిఫాబాద్‌రూరల్: కెరమెరి మండలంలోని సకారాంగూడ, చందుగూడ, ఆసిఫాబాద్ మండలంలోని కోసార, భవానినగర్‌లో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గడిచి న 9 రోజుల నుంచి బుట్టల్లో పెంచుతున్న గోధుమ విత్తనాలకు పెళ్లికాని యువతులు నీళ్లు పోశారు. అనంతరం మహిళలు, గ్రామస్తులు గోధుమ బుట్టలు నెత్తిన పెట్టుకుని నృత్యాలు చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివప్రసాద్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న మహిళలు

సంత..చింత



గుడారాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు

- షెడ్లు లేక కవర్లతోనే గుడారాలు
- సౌకర్యాలు లేవు
- చినుకుపడితే చిత్తడిగా..
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు

వాంకిడి: మండల కేంద్రంలోని చిక్లీవాగు తీరంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంత అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రతి ఏడాది సంత నిర్వహణకు వేలం వేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. వేలం ద్వారా లక్షల రూపాయలు గ్రామ పంచాయతీకి సమకూరుతున్నా సంతలో సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన షెడ్లు నామరూపాలు లేకుండా పోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు సంత ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

లక్షల్లో ఆదాయం

మండల కేంద్రంలో నిర్వహించే సంతలో మహారాష్ట్ర నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది వ్యాపారులు, కూరగాయలు అమ్ముకునే రైతులు వస్తుంటారు. ప్రతీ గురువారం లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. కానీ సౌకర్యాలు లేమితో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా సంత చిత్తడిగా మారుతుంది. వ్యాపారులు బురదలో గుడారాలు ఏర్పాటు చేసుకుని ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. వాహనాల్లో వచ్చేవారు పార్కింగ్ కోసం ప్రత్యేకించి స్థలం లేక రోడ్డుపై నిలుపుతున్నారు. సంతలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు స్థలం ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గత నాలుగేళ్ల నుంచి సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. 2022లో వేలం ద్వారా రూ.6 లక్షలు, 2023లో రూ.9 లక్షలు, 2024లో రూ.4.75 లక్షలు, 2025లో రూ.9 లక్షలు నిధులు సమకూరాయి. నిధులకు అనుగుణంగా ఏటా సంతలో సౌకర్యాల కల్పనపై దృష్టిసారిస్తే బాగుంటుందని మండలవాసులు కోరుతున్నారు. కాగా, సంతలో సమస్యలపై వివరణ కోరేందుకు పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

నిధులు కేటాయించాలి

సంతకు ఏటా వేలం ద్వారా నిధులు సమకూరుతున్నా అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. అధికారులు వసతులు కల్పించడం లేదు. కనీస సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయించాలి.

– జాడి మనోహర్, ఖమాన

అభివృద్ధి పనులు చేపట్టాలి

వర్షాలు కురిస్తే సంత ప్రాంతమంతా చిత్తడిగా మారుతుంది. బురదలో నడవకుండా ఉంది. సంతలో షెడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. సౌకర్యాలు కల్పించి వ్యాపారులు, ప్రజల ఇబ్బందులు తొలగించాలి. పంచాయతీ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టాలి.

– దుర్గం సునీత, వాంకిడి

ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ



కమ్మర్‌గాంలో దెబ్బతిన్న పత్తి



మోతుగూడలో నీటమునిగిన పెసర పంట



బూర్గుడలో నల్లబడిన పత్తి పంట

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువ ప్రాంతంలో ఉన్న మహారాష్ట్ర గ్రామాల్లో ఎడతెరపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పెన్‌గంగ పరివాహక ప్రాంత గ్రామాలైన మాకిడి, జక్కాపూర్, హుడ్కిలి, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రహీముద్దిన్, ఎస్సై కమలాకర్ వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిపై వంతెన వద్ద పెన్‌గంగ నది ఉధృతిని పరిశీలించారు. రైతులు విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీవోలకు సమాచారం ఇవ్వాలన్నారు.

పెంచికల్‌పేట్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెంచికల్‌పేట్ వద్ద పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దవాగు వరద అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ గ్రామాల్లోని పంట చేలను ముంచెత్తింది. వందల ఎకరాల్లో పత్తి నీట మునిగింది. అగర్‌గూడ నుంచి కమ్మర్‌గాం వెళ్లే ప్రధాన రహదారిపై వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

నీట మునిగిన పంటలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి పెద్ద వాగులు సమీపంలో పంటలు పూర్తిగా నీట మునిగాయి. ఆడ ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తడంతో వాగుకు నీటి ప్రవాహం పెరిగింది. సమీపంలోని పొలాల నుంచి నీరు చేరి ఇసుక కప్పేసింది.

ఆలయంలో భక్తుల రద్దీ



హారతి తీసుకుంటున్న భక్తులు

రెబ్బెన: శ్రావణ ఆదివారం పురస్కరించుకుని మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించారు. మహంకాళి అమ్మవారి పడుకుని ఉన్న ఆకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉద్యోగం కోసం మొక్కుకున్న భక్తురాలికి జాబ్ రావడంతో మొదటినెల వేతనాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ఊరేగిస్తున్న యాదవ సంఘం నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు మర్తిడి గ్రామంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మర్తిడి గ్రామంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఊరేగింపు చేపట్టారు. అలాగే మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

కాగజ్‌నగర్ రూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండలంలోని నజ్రుల్‌నగర్‌లోని విలేజ్ నెం 10, 12తో పాటు భట్టుపల్లి గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు.



నజ్రుల్‌నగర్‌లో ఉట్టి కొడుతున్న గ్రామస్తులు

రైతులకు పరిహారం అందించాలి



పత్తి పంట పరిశీలిస్తున్న సంగెపు బొర్రన్న

ఇంద్రవెల్లి: పంటలు వరద నీటిలో కొట్టుకుపోయి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఆదివారం శంకర్‌గూడ, దుబ్బగూడ గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఎకరానికి రూ. 25 వేల చొప్పున అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు గోవర్ధన్, రేఖ, సంతోష్, వినోద్, సచ్చిదానంద్ పాల్గొన్నారు.

తాంసి: రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25వేల పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవిదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గోట్కూరిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కూలిన ఇళ్లను పరిశీలించి ధైర్యంగా ఉండాలని సూచించారు. సర్వే చేయించి, నష్టం అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. రైతులు అశోక్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.42వేల చెక్కును ఎమ్మెల్సీ దండె విఠల్ మండలంలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి అందజేశారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో చెక్కు అందజేసి మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మాజీ సర్పంచ్ కోద్ది విశ్వేశ్వర్, రంగు సురేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరెకుల సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జ్యోతినగర్ కాలనీ సమీపంలో సిర్పూర్(టి) మండల ఆరె కుల సంఘం భవన నిర్మాణానికి ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరెకుల సంఘం భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, ఆరెకుల సంఘం అధ్యక్షుడు చన్కపురె శంకర్, బొట్టుపల్లి మోహన్, ఎల్ములే సరిత, ఎల్ములే శంకర్, సోహేల్ అహ్మద్, అఫ్సర్ ఖాన్, రవీందర్, ఎల్ములే కిషోర్‌కుమార్, చౌదరి ప్రభాకర్, భగవత్, అశోక్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట

రెబ్బెన: ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్టేషన్ ముందు ఉన్న ఖాళీస్థలంలో ఒక చోట బుంగ పడి ప్రమాదకరంగా ఉంది. ఆ పక్కనే సెప్టిక్ ట్యాంక్ పైకప్పు స్లాబు నాసిరకంగా పనులు చేపట్టడంతో కప్పు కూలింది. స్టేషన్ లోపల కొన్ని నెలల క్రితమే వేసిన టైల్స్ ఊడిపోయాయి. ప్లాట్‌ఫాంపై పిచ్చిమొక్కలు ఉన్నాయి. తాగునీటి ట్యాప్‌లు ధ్వంసమై కనిపిస్తుంది.



కూలిన సెప్టిక్ ట్యాంకు పైకప్పు స్లాబు



ఊడిన పార్కింగ్ టైల్స్



ధ్వంసమై ఉన్న తాగునీటి ట్యాప్



స్టేషన్ ముందు ఖాళీ స్థలంలో ప్రమాదకరంగా ఉన్న బుంగ



ప్లాట్‌ఫాంపై పెరిగిన పిచ్చిమొక్కలు

కోతకు గురైన రోడ్డు, కాలువ



కోతకు గురై ప్రమాదకరంగా రోడ్డు

దహెగాం: భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం కలిగింది. గత శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వర్షాలతో పెద్దచెరువు కాలువకు గండి పడింది. ప్రధాన రహదారి పక్కన గుంత ఏర్పడగా ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, రాత్రి సమయంలో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గండి పడ్డ కాలువక మరమ్మతులు చేయాలని, రోడ్డు పక్కన ఏర్పడ్డ గుంతలో మట్టి నింపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



కోతకు గురైన కాలువ

జలదిగ్బంధంలో 'కామాయి'

సాత్నాల: భారీ వర్షానికి పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహించడంతో భోరజ్ మండలం కామాయి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి వెళ్లే రహదారి పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి.